క్లుప్తంగా

వీరభద్రుడికి పరోక్షసేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్ర పాలకుడు బయలు వీరభద్రస్వామికి సోమవారం అమావాస్య సందర్భంగా తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి 25 మంది భక్తులు పరోక్షసేవగా విశేషార్చనలు జరిపించుకున్నారు.

కేజీబీవీ తనిఖీ



భోజనాన్ని రుచి చూస్తున్న అధికారులు

పగిడ్యాల: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఎంపీడీఓ వెంకటరమణ, ఎంఈఓ –2 మురళీమోహన్‌రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మండల ఇంజినీర్ వెంకటేశ్వర్లు సోమవారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. అక్కడి సమస్యలను ప్రత్యేక అధికారిణి ఉష అధికారుల దృష్టికి తెచ్చారు. తరగతి గది గోడ బీటలు వారిందని, తాగునీటి కుళాయిల వద్ద వర్షానికి తడవకుండా రేకుల షెడ్డు ఏర్పాటు చేయించాలని విద్యార్థులు ఎంపీడీఓను కోరారు. సమస్యలపై నివేదికను తయారు చేసి కలెక్టర్‌కు పంపుతామని ఎంపీడీఓ తెలిపారు.

సస్యరక్షణ చర్యలు తప్పనిసరి

వెలుగోడు: వర్షాల కారణంగా పైర్లలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏఓ పవన్‌కుమార్ రైతులకు సూచించారు. గట్టు తండా, వెలుగోడు, గుంతకందాల సమీపంలోని పొలాలను ఏవో పవన్‌కుమార్ సోమవారం పరిశీలించారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట వ్యవసాయ విస్తరణ సిబ్బంది రామకృష్ణ, వెంకటశివ ఉన్నారు.

శివతాండవ స్త్రోత్రం వరల్డ్ రికార్డులో విన్మయ్‌శ్రీ



కర్నూలు కల్చరల్: నందికొట్కూరుకు చెందిన వందన, శ్రీధర్‌రెడ్డి దంపతులు కుమార్తె విన్మయ్‌శ్రీ శివ తాండవ స్త్రోత్రం కూచిపూడి వరల్డ్ రికార్డు మెగా ఈవెంట్‌లో పాల్గొని ప్రశంసలు అందుకుంది. ఇంటర్నేషనల్ కర్నాటిక్ మ్యుజీషియన్స్ అండ్ డ్యాన్సర్స్ (ఐసీఎండీఏ) వారు ఈనెల 1న రాత్రి వారణాసిలో నిర్వహించిన శివతాడవం 10వ వరల్డ్ రికార్డ్ మెగా ఈవెంట్‌లో విన్మయశ్రీ పాల్గొని ప్రతిభ కనబరచడంతో నిర్వాహకులు సర్టిఫికెట్, మెడల్ ప్రదానం చేశారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న ఉద్యోగులు

మిడుతూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలతో కర్నూలు ఆసుపత్రిలో వైద్యం పొందుతున్న వర్క్‌ఇన్‌స్పెక్టర్ అంజాద్ బాషా కుటుంబానికి సచివాలయ సిబ్బంది, మండల ఉద్యోగులు, సిబ్బంది ఆర్థిక సాయం అందజేశారు. రూ.40 వేలను సేకరించి సోమవారం కుటుంబ సభ్యులకు అందించారు.

31కి చేరిన డయేరియా కేసులు

పాములపాడు: వేంపెంట గ్రామంలో అతిసార వ్యాధి కేసులు 31కి చేరాయని డాక్టర్ నాగలక్ష్మి తెలిపారు. సోమవారం ఇద్దరు చిన్నారులు, ముగ్గురు పెద్దలు వ్యాధితో బాధపడుతూ వైద్య శిబిరానికి వచ్చారన్నారు. ప్రథమ చికిత్స అనంతరం చిన్నారులను వారి కుటుంబ సభ్యులు నందికొట్కూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారన్నారు. ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. గ్రామంలో వైద్య శిబిరం కొనసాగిస్తున్నామన్నారు.

అధికారులు అందుబాటులో ఉండాలి

- ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే జయసూర్య ఆదేశించారు. సోమవారం సాయంత్రం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాగునీరు కలుషితం కాకుండా, అంటు వ్యాధులు ప్రబల కుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఐసీడీఎస్ సీడీపీఓ కోటేశ్వరి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పంటను కాపాడుకోండి

జూపాడుబంగ్లా: అధిక వర్షాల వల్ల పంటలు దెబ్బతినకుండా సస్యరక్షణ చర్యలు పాటించి కాపాడుకోవాలని నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు అశోక్‌కుమార్, శివరామకృష్ణ, వెంకటరమణ, సతీష్ బాబు తెలిపారు. సోమవారం వారు ఏఓ కృష్ణారెడ్డితో కలిసి తంగడంచ, పారుమంచాల పరిధిలోని మొక్కజొన్న, కంది, పొగాకు పంటలను పరిశీలించి రైతులకు సూచనలిచ్చారు.

రైతుబాంధవుడికి ఘన నివాళి

- వాడవాడలా మహనేత వర్ధంతి కార్యక్రమాలు
- వైఎస్సార్ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసిన నాయకులు



నందికొట్కూరులో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళలర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నందికొట్కూరు: రైతు బాంధవుడు, దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నివాళులర్పించారు. సోమవారం వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకుని నియోజకవర్గ వ్యాప్తంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన సేవలను కొనియాడారు. నందికొట్కూరులోని కేజీ రోడ్డు, కోట వీధి, పాత బస్టాండ్‌లోని వైఎస్ఆర్ విగ్రహాలకు నాయకులు చంద్రమౌళి, నాయకులు ఉపేంద్రారెడ్డి, లక్ష్మిరెడ్డి, అబుబక్కర్, విజ్జి, రవి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఆరోగ్యశ్రీ, ఫీజురీయింబర్స్‌మెంట్, రైతులకు ఉచిత విద్యుత్ తదితర పథకాలతో ప్రవేశపెట్టి ప్రతి ఒక్కరి మదిలో వైఎస్సార్ నిలిచిపోయారని నాయకులు కొనియాడారు. వైఎస్సార్ కడప జిల్లా ఇడుపులపాయలో వైఎస్సార్ సమాధి వద్ద మాజీ ఎమ్మెల్యే లబ్బి వెంకటస్వామి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు జగన్‌రఫి, వెంకటస్వామి, బాబు, మహేశ్వరరెడ్డి, రంగారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సత్యారెడ్డి, కిషోర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

- **పగిడ్యాల:** స్థానిక బస్టాండులోని వైఎస్సార్ విగ్రహానికి ఆయన వర్ధంతి సందర్భంగా జెడ్పీటీసీ పుల్యాల దివ్య పూల మాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అందించి మరుపురాని మహనేతగా ప్రజల హృదయాల్లో ఉండిపోయారని జెడ్పీటీసీ అన్నారు. అలాగే లక్ష్మాపురం, పడమర ప్రాతకోట, నెహ్రూనగర్, పాత, కొత్త ముచ్చుమర్రి, ఎం.ఎస్. ఘణపురం తదితర గ్రామాల్లో వైఎస్సార్ చిత్రపటాలకు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీ బోరెల్లి శ్యామలమ్మ, కో ఆప్షన్ సభ్యులు అస్లాంబాషా, ఎంపీటీసీ కళావతి, సర్పంచ్‌లు పెద్ద ఆంజనేయులు, కాటం రాధమ్మ, పెరుమాళ్ల శేషన్న, ప్రతాపరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు పుల్యాల నాగిరెడ్డి, ఉస్మాన్‌బాష, నాగశేనారెడ్డి, మద్దిలేటిరెడ్డి, సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ శేషన్న తదితరులు పాల్గొన్నారు.
- **జూపాడుబంగ్లా:** వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకుని జూపాడుబంగ్లా సంతగేటు ఆవరణలోని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి, వైఎస్సార్సీపీ జిల్లా కోఆర్డినేటర్ కోసిక తిరుమలేశ్వరరెడ్డి, మండల వైస్ ఎంపీపీ తోకల కృష్ణారెడ్డి, సర్పంచ్ నాగార్జునరెడ్డి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.
- **పాములపాడు:** మండల కేంద్రంలో వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నీటి సంఘం జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు కోట్ల నాగేశ్వరరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు చౌడయ్య, కో ఆప్షన్ సభ్యుడు ముర్తుజావలి, మాజీ సర్పంచు బాలునాయక్, నాయకులు అంబయ్య, మాలిక్, నాగిరెడ్డి, శివలింగం, స్వామిదాసు పాల్గొన్నారు.



కొత్తపల్లిలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, నాయకులు

కొత్తపల్లి: మండల కేంద్రంలో వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నారాయణ రెడ్డి, చింతమాను శ్రీనివాసులు యాదవ్, వైస్ ప్రెసిడెంట్ జయరాజ్, శంకర్‌రెడ్డి, శీను పాల్గొన్నారు.



పగిడ్యాలలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న జెడ్పీటీసీ పుల్యాల దివ్య, అభిమానులు



జూపాడుబంగ్లా సంతగేటు వద్ద వైఎస్సార్ విగ్రహం వద్ద జోహార్లు అర్పిస్తున్న నాయకులు



పాములపాడులో వైఎస్సార్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు

పేదల హృదయాల్లో చెరగని ముద్ర



వైఎస్సార్ స్మృతివనంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, తదితరులు

ఆత్మకూరు: దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేదల హృదయాల్లో చెరగని ముద్ర వేశారని వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ నాయకులు శిల్పా భువనేశ్వర్ రెడ్డి, పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి కొనియాడారు. వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా వైఎస్సార్ స్మృతివనంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, ఫీజురీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ పథకాలతో ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించిన గొప్ప నాయకుడు వైఎస్సార్ అన్నారు. సిద్ధాపురం ఎత్తిపోతల పథకంతో పాటు లింగాల, చెలిమెల్ల, ఇస్కాల, సంగమేశ్వరం ఎత్తిపోతల పథకాలను ఒకేరోజు మంజూరు చేయించి, వేలాది ఎకరాలకు సాగునీరు అందించిన రైతు బాంధవుడన్నారు. అంతకుముందు ఆత్మకూరులోని నంద్యాల టర్నింగ్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కరివేన గ్రామంలో వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ వెలుగోడు మండలం అధ్యక్షులు అంబల ప్రభాకర్‌రెడ్డి, నాయకులు దేశం తిరుపంరెడ్డి, వెంకటస్వామిగౌడ్, మమీర్, మున్నీర్‌బాషా, శివరామ్, విజయ్, రవి, లక్ష్మిరెడ్డి, రాజు, వెంకటసుబ్బయ్య, కలీముల్లా, లక్ష్మన్నరావు, మహానంది మండలం నాయకులు పుల్లయ్య, షేక్‌మహబూబ్‌బాషా, నాగేశ్వర్‌రెడ్డి, సురేష్, తిమ్మయ్య పాల్గొన్నారు.

- **వెలుగోడు:** దివంగత నేత వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి పొట్టి శ్రీరాములు సెంటర్ వరకు ర్యాలీ పార్టీ నాయకులు కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అక్కడ వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ శ్రీశైలం నియోజకవర్గ నేత శిల్ప భువనేశ్వర్ రెడ్డి, మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ రెడ్డి, సర్పంచ్ వేల్పుల జైపాల్, నాయకులు దేశం తిరుపం రెడ్డి, ఇలియాస్ ఖాన్, వైస్ ఎంపీపీ శంకర్ నాయక్, గోవిందు, షంషీర్ అలీ, అచ్చయ్య, రామిరెడ్డి, వంగాల నాగేశ్వరరెడ్డి, గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.



శ్రీశైలంప్రాజెక్ట్: వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పార్టీ కార్యకర్తలు

- **శ్రీశైలంప్రాజెక్ట్:** మహనేత, దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని సోమవారం శ్రీశైలంప్రాజెక్ట్‌లో నిర్వహించారు. బస్టాండ్ ఆవరణంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వట్టి వెంకటరెడ్డి, మండల నాయకులు భరత్‌రెడ్డి, పాపారావు, హిదాయతుల్లా, మల్లిక్షావళి, బక్కన్న, ఏసు, గౌస్‌మొహిద్దీన్, దానియేలు, ఆటో మల్లి, దమయంతి, సరస్వతి పాల్గొన్నారు.



వెలుగోడులో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



ఆత్మకూరులో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మట్టి మిద్దెల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

జూపాడుబంగ్లా: మట్టిమిద్దెల్లో నివాసం ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ సూచించారు. సోమవారం ఆయన తాటిపాడు గ్రామంలో పర్యటించి మట్టిమిద్దెల ఇళ్లను పరిశీలించారు. మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాల వల్ల మట్టిమిద్దెలు కూలే ప్రమాదం ఉందని, అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. అవసరమైతే పంచాయతీ కార్యాలయాల్లో నిద్రించాలని సూచించారు. మట్టిమిద్దెలు కూలేందుకు సిద్ధంగా ఉన్నా, మిద్దెలు కూలినా సమాచారం ఇవ్వాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. తాగునీరు కలుషితం కాకుండా, వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఈయన వెంట డీటీ నాగన్న, ఆర్ఐ శ్రీరంగారెడ్డి ఉన్నారు.

కేసీ కాల్వలో దూకి వృద్ధుడి ఆత్మహత్యాయత్నం

- కాపాడిన వ్యవసాయ కూలీలు..

జూపాడుబంగ్లా: పాములపాడు మండలం చెలిమిల్ల గ్రామానికి చెందిన వృద్ధుడు గిడ్డయ్య(68) సమీపంలోని కేసీ కాల్వలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పొలం పనులకు వెళ్తున్న వ్యవసాయ కూలీలు పరమేష్, రమణ, హరి, రాజపాల్, ఎల్లయ్య, రవితేజ గుర్తించి వృద్ధుడిని అతికష్టం మీద ఒడ్డుకు చేర్చారు. అప్పటికే నీళ్లుతాగి ఊపిరి తీసుకునేందుకు ఇబ్బంది పడుతుండటంతో యువకులు సపర్యలు చేసి, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు ఎందుకు యత్నించావని యువకులు వృద్ధుడిని ఆరా తీయగా.. తన కొడుకు హరిప్రసాద్, కోడలుతో కలిసి నందికొట్కూరులో ఉంటున్నామని, వారు బాగానే చేసుకుంటున్నా.. తనకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో వారికి భారం కాకూడదని, చనిపోదామని నిర్ణయించుకుని కేసీ కాలువలో దూకానని చెప్పాడు. ఈలోగా కొడుకు, కోడలు అక్కడికి చేరుకుని వృద్ధుడిని తీసుకెళ్లిపోయారు.



అపస్మారకస్థితిలో గిడ్డయ్య

సంక్షిప్తం

తమలపాకు తోటల పరిశీలన

ఆత్మకూరు: తమలపాకు తోటలను జిల్లా ఉద్యానశాఖ అధికారి యు.నాగరాజు సోమవారం పరిశీలించారు. నీటిని బయటకు పంపించి తోటలను కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారిణి కె.చందన, ఎంపీఓ శ్రీనివాస్, ఎంపీఈఓ ముర్తుజావలి పాల్గొన్నారు.

రామకృష్ణకు ఘన నివాళి

ఆత్మకూరు: కామ్రెడ్ టి.రామకృష్ణ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సోమవారం పలువురు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. ధనుంజయ మీటింగ్‌హాల్లో జరిగిన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.యేసురత్నం, సీనియర్ నాయకులు యాదాటి నాగేంద్రుడు, పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, మండల కార్యదర్శి నరసింహానాయక్, ఎం.రజాక్ పాల్గొన్నారు.

కలుషిత నీటిని తాగొద్దు


ఆత్మకూరు: కలుషిత నీటిని తాగి రోగాలబారిన పడొద్దని వైద్యాధికారి పవన్‌కుమార్ ప్రజలకు సూచించారు. సోమవారం బాపనంతాపురం గ్రామంలో 104 సంచార వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటిని కాచి వడబోసి చల్లార్చి తాగాలన్నారు.

ఘనంగా ఎల్ఐసీ వార్షికోత్సవం

ఆత్మకూరు: ఎల్ఐసీ వార్షికోత్సవాన్ని బ్రాంచ్ మేనేజర్ పాండురంగానాయక్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. కెనరా బ్యాంకు మేనేజర్ సూర్యదేవర నాయక్ హాజరై కేక్ కట్ చేశారు. ఎల్ఐసీ సాధించిన ప్రగతిని పాండురంగానాయక్ వివరించారు. ఇన్సూరెన్స్ పాలసీలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు.

ప్రశాంత జీవనం సాగించాలి

- ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్



మాట్లాడుతున్న డీఎస్పీ రామాంజినాయక్

కొత్తపల్లి: గ్రామాల్లో గొడవల జోలికి వెళ్లకుండా ప్రశాంత జీవనం సాగించాలని ఆత్మకూరు డీఎస్పీ రామాంజినాయక్ సూచించారు. సోమవారం రాత్రి నందికుంట గ్రామంలో ప్రజలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్‌మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి ఫేక్ ఫోన్ కాల్స్ వస్తే చాకచక్యంగా వ్యవహరించాలన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే గొడవలకు వెళ్లకుండా పోలీసులను సంప్రదించి సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలన్నారు. చిన్నపిల్లలకు, లైసెన్స్ లేని వారికి వాహనాలు ఇవ్వరాదన్నారు. ఆయన వెంట ఆత్మకూరు సీఐ సురేష్‌కుమార్ రెడ్డి, ఎస్ఐ కేశవ, ఏఎస్ఐ బాబాఫకృద్దీన్ ఉన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

- జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ



తడిసిన మొక్కజొన్న కంకులను చూపుతున్న రైతులు

ఆత్మకూరు/పాములపాడు/కొత్తపల్లి: నీట మునిగి పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ఆదుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ అన్నారు. ఆత్మకూరు మండలం కరివేన, నల్లకాల్వ, కొత్త రామాపురం, వడ్లరామాపురం, పాములపాడు, చెలిమిల్ల, కొత్తపల్లి, దుద్యాల, నందికుంట గ్రామాల పరిధిలో నీట మునిగిన పైర్లను సోమవారం ఆయన ఆయా మండలాల వ్యవసాయ అధికారులతో కలిసి పరిశీలించారు. దెబ్బతిన్న ప్రతి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు తయారు చేసి, నష్టపోయిన ప్రతి రైతును ఆదుకునేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఆయన వెంట ఏడీఏ ఆంజనేయ, ప్రధాన శాస్త్రవేత్త రాధకుమారి, సీనియర్ శాస్త్రవేత్త బాలాజీ నాయక్ తదితరులు ఉన్నారు.

కృష్ణానదిలో మరబోటు గల్లంతు

- ముగ్గురు సురక్షితం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలండ్యాం దిగువ భాగంలో సోమవారం మధ్యాహ్నం కృష్ణానదిలో వరద ఉధృతికి ఓ మరబోటు గల్లంతయ్యింది. స్థానికుల సమాచారం మేరకు.. లింగాలగట్టుకు చెందిన నూకరాజు, ముసిలి అనే వ్యక్తి నాటు మరబోటులో నల్లవాగు సమీపంలో చేపలవేటకు వెళ్తుండగా మరబోటు అదుపుతప్పి బోల్తా పడి గల్లంతయ్యింది. బోటు డ్రైవర్‌తో పాటు మత్స్యకారులు నూకరాజు, ముసిలి నీటిలో ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నారు. స్థానికులకు సమాచారం ఇవ్వడంతో మరోబోటులో వారిని లింగాలగట్టుకు క్షేమంగా చేర్చారు. వరద ఉధృతి తీవ్రంగా ఉండడంతో నదిలో చేపలవేటకు వెళ్లకూడదని, మరబోట్లు, పుట్టీలు తిప్పరాదని పోలీసులు ఎన్ని హెచ్చరికలు జారీ చేసినప్పటికీ కొందరు మత్స్యకారులు బేఖాతర్ చేస్తున్నారు.

గణేష్ ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి

పగిడ్యాల: గణేష్ ఉత్సవాలకు అనుమతులు తీసుకోవాలని ముచ్చుమర్రి ఎస్ఐ సి.శరత్‌కుమార్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విగ్రహాలు ఏర్పాటు చేసే ఉత్సవ కమిటీ సభ్యులు https://ganeshutsav.net వెబ్‌సైట్ లేదా 7995095800 మొబైల్ నంబర్‌కు వాట్సాప్ యాప్ ద్వారా కానీ దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి అనుమలు ఇస్తామన్నారు. మండపాల వద్ద డీజేలకు, లౌడ్ స్పీకర్లకు అనుమతి లేదన్నారు. నిమజ్జనం రోజు ఊరేగింపులో రంగులు చల్లుకోవడం, టపాసులు పేల్చడం నిషేధమన్నారు.

కుంటలు, చెరువులు కాపాడండి

పాములపాడు: మండలంలోని మిట్టకందాల గ్రామంలో అన్యాక్రాంతమైన కుంట, చెరువులు కాపాడాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు ప్రేమరాజు గ్రామస్తులతో కలిసి సోమవారం తహసీల్దార్ సుభద్రమ్మకు వినతి పత్రం అందజేశారు. కొందరు నాయకులు కుంటలు, వాగులు, వంకలు ఆక్రమించుకోవడంతో వర్షపునీరు పంట పొలాల్లోకి, గ్రామంలోకి ప్రవహిస్తోందని ఫిర్యాదు చేశారు. అలాగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలు 4 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ సుభద్రమ్మ తెలిపారు.

వరికి ఎండాకు తెగులు సోకే అవకాశం ఉంది

నంద్యాల(అర్బన్): ఎడతెరపి లేని వర్షాల కారణంగా వరిపైరుకు బ్యాక్టీరియా, ఎండాకు తెగులు సోకే అవకాశం ఉందని మహానంది మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం తమ్మడపల్లె గ్రామ పరిధిలోని వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాముపొడ తెగులు ఆశిస్తే లీటరు నీటికి 2ఎంఎల్ ఎక్సోకోనోజోల్ 1ఎంఎల్ ప్రొఫికొనజోల్ 15రోజుల్లో రెండుసార్లు పిచికారీ చేయాలన్నారు. మొక్కజొన్న పైరు ముంపునకు గురైనప్పుడు నీటిని తొలగించి 50కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ పైపాటుగా వేయాలన్నారు. ఆయన వెంట ఏఈఓ మధు ఉన్నారు.

కుంగిన ప్రధాన రహదారి

నంద్యాల(అర్బన్): మహానంది మండలం బొల్లవరం గ్రామంలోకి ప్రవేశించే ప్రధాన రహదారి వ్యవసాయ బావిలోకి కుంగిపోయింది. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కుంగిందా.. మరేదైనా కారణముందా అంటూ గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల బావి మధ్య గోడను ఏర్పాటు చేశారని, రోడ్డు, వ్యవసాయ బావి గోడ కొంత భాగం కుంగిపోవడం అనుమానాలకు తావిస్తోందని, అధికారులు స్పందించి అనుమానాలు నివృత్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ప్రభుత్వానికి నివేదికలు అందిస్తాం

నందికొట్కూరు: వర్షాలకు దెబ్బతిన్న పంటల వివరాలు సేకరించి నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి అందిస్తామని ఏడీఏ విజయశేఖర్ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని మల్యాల, శాతనకోట, మిడుతూరు మండలంలోని వీపనగండ్ల గ్రామాల పరిధిలో దెబ్బతిన్న పంటలను నంద్యాల శాస్త్రవేతలు సతీష్‌బాబు, వెంకటరమణ, శివరామకృష్ణ, అశోక్‌కుమార్, ఏఓ షేక్షావలితో కలిసి పరిశీలించారు. మొక్కజొన్న, సోయాబీన్, పత్తి, కంది, మినుము, వేరుశనగ, వరి పంటలు దెబ్బతిన్నట్లు గుర్తించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ నందికొట్కూరు మండలంలో 1,359 హెక్టార్లు, మిడుతూరు మండలంలో 651 హెక్టార్లు, పగిడ్యాల మండలంలో 1,130, జూపాడుబంగ్లా మండలంలో 673.8 హెక్టార్లలో పంటలు దెబ్బతినట్లు తెలిపారు.



పత్తి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేతలు, అధికారులు

గుడిసె వాసులకు పట్టాలు ఇవ్వాలి

నందికొట్కూరు: బైరెడ్డి నగర్‌లో నివాసముంటున్న గుడిసె వాసులకు పట్టాలు ఇవ్వాలని సీపీఎం నాయకులు నాగేశ్వరరావు, భాస్కరరెడ్డి కోరారు. సోమవారం అల్లూరులో ఎమ్మెల్యే జయసూర్యను కలిసి గుడిసె వాసులకు పట్టాలు ఇవ్వాలని వినతి పత్రం అందజేశారు.

9 మద్యం బాటిళ్లు స్వాధీనం

మిడుతూరు: మండల పరిధిలోని చెరుకుచెర్ల గ్రామానికి చెందిన వెంకన్నగౌడు నుంచి 9 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సోమవారం ఎస్ఐ ఓబులేసు తెలిపారు. ఇంట్లో మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో సోదాలు నిర్వహించి నిందితుడిని అరెస్ట్ చేసి, మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆరుగురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

నందికొట్కూరు: కులం పేరుతో దూషించారని ఓ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మరో సామాజిక వర్గానికి చెందిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి సోమవారం తెలిపారు. మారుతీనగర్‌లోని పక్కపక్కన ఉన్న రెండు వేర్వేరు సామాజిక వర్గాల వారు తమ ఇళ్ల ముందు శుభ్రం చేసుకునే విషయంలో గొడవ పడి దూషించుకున్నట్లు సీఐ తెలిపారు.